మత్తుబాబుల అడ్డా



కంచరపాలెం హాకర్స్ జోన్‌లో అసాంఘిక కార్యకలాపాలు

- పెడదోవ పడుతున్న విద్యార్థులు
- నిరుపయోగ దుకాణాల్లో ఆగడాలు
- వాటిని కూల్చేయాలంటున్న స్థానికులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు, పోలీసులు



మత్తుకు బానిసవుతున్న యువత (ఫైల్ ఫోటో)

కంచరపాలెం: చిరు వ్యాపారుల కోసం నిర్మించిన హాకర్స్ జోన్ మత్తుబాబులకు అడ్డాగా మారింది. నిరుపయోగంగా ఉన్న దుకాణాల్లో యువకులు నిత్యం మందు, గంజాయి సేవిస్తూ పెడదారి పట్టడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి మత్తుబాబుల ఆగడాలతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదీ జీవీఎంసీ 55, 56వ వార్డు పరిధి కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కింద హాకర్ల కోసం నిర్మించిన జోన్‌లో ప్రస్తుత దుస్థితి. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా తోపుడు బళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారాలను ఒకేచోటకు తీసుకు రావాలనే ఉద్దేశంతో కంచరపాలెం నేతాజీ వంతెన కింద 30 ఏళ్ల క్రితం నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయం (హాకర్స్ జోన్) నిర్మించింది. ఇందులో సుమారు 40 దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులు ముందుకు రాకపోవడంతో సంవత్సరాలు గడుస్తున్నా దుకాణాలు నేటికీ తెరుచుకోలేదు. ఇప్పటికీ బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే అనేక మంది వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. హాకర్స్ జోన్ వినియోగంలోకి తెస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. బీఆర్‌టీఎస్ పనులు పూర్తయితే హాకర్స్ జోన్ వినియోగంలోకి తెస్తామన్న అధికారులు జాడ మాత్రం కనిపించడం లేదు.

అసాంఘిక కార్యక్రమాలకు నిలయం

హాకర్స్ జోన్‌లో నిర్మించిన దుకాణాలు ఖాళీగా ఉండడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఖాళీగా ఉన్న దుకాణాలన్నీ గంజాయి, మత్తు సేవించే మందుబాబులతో నిండిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. పగటి పూట సమీప రామ్మూర్తి పంతులుపేట, కంచరపాలెం పాఠశాలల విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమ పిల్లలను పాఠశాలలకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాలనీవాసులు మందుబాబులను మందలిస్తే కొట్లాటకు దిగుతున్నారు. గంజాయి మత్తులో తమకు, తమ పిల్లలకు ఏ హాని తలపెడతారోనని భయపడుతున్నారు. గాంధీనగర్ వాసులకు ప్రధాన రహదారి కావడంతో వారు హాకర్స్ జోన్ పక్క నుంచి రాకపోకలు సాగించేందుకు ఆందోళన చెందుతున్నారు.



అపరిశుభ్రంగా మారిన దుకాణాలకు రాకపోకలు సాగించే మార్గం



ముందుసీసాలు, సిగిరెట్ పీకలతో జుగుప్సాకరంగా మారిన దుకాణాలు

బీఆర్‌టీఎస్‌పై వ్యాపారాలు

నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో బీఆర్‌టీఎస్ రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. సమీపంలో పాఠశాలలు నిర్వహించే సమయంలో రామ్మూర్తి పంతులుపేట, కా.కాలనీ, కంచరపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు విడిచిపెట్టినపుడు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరో వైపు ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సంబంధింత అధికారులు స్పందించి దుకాణాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన వాణిజ్య సముదాయం

యువత పెడదోవ పడుతున్నారు

దుకాణాలు ఖాళీగా ఉండడంతో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందు, గంజాయి సేవించి యువత పెడదోవ పడుతున్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను పంపితే ఇలా మారుతున్నారు. సిగరెట్లు సేవిస్తూ అటుగా వెళ్లే కాలనీవాసులపైకి పొగ వదులుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే తమ పిల్లలను ఏం చేస్తారో అని ఆందోళనగా ఉంది.

– ఎస్.రాధాకల్యాణి, గాంధీనగర్

పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం

ఆకతాయిల ఆగడాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. గంజాయి సేవించిన మత్తులో ఏ ప్రమాదానికి ఒడిగడతారోనని ఆందోళనగా ఉంది. స్థానిక పాఠశాలల విద్యార్థులు కూడా ఇక్కడికే చేరి తమ జీవితాలను మత్తుతో నాశనం చేసుకుంటున్నారు. పోలీస్ అధికారులు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలి.

– ఆర్.రాజారమేష్, కంచరపాలెం

దుకాణాలు వినియోగిస్తే...

వాణిజ్య సముదాయంలో నిరుపయోగంగా దుకాణాలు ఉండడంతో అటుగా రాకపోకలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దీంతో మత్తుబాబులకు అడ్డాగా మారాయి. జీవీఎంసీ అధికారులు ఆ దుకాణాలను వినియోగంలోకి తీసుకొస్తే ఆకతాయిలు కనిపించరు. పాఠశాలల నుంచి ఫిర్యాదులు రావడంతో పోలీసు గస్తీని ఏర్పాటు చేశాం. ఇటీవల ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించి మత్తుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించాం.

– భాస్కరరావు, సీఐ, ఐదో పట్టణ పోలీస్ స్టేషన్, కంచరపాలెం.

క్లుప్తంగా

వాకర్స్ జిల్లా 101 కాన్ఫరెన్స్ చైర్మన్‌గా కమల్‌బైడ్



కాన్ఫరెన్స్ చైర్మన్ కమల్‌బైడ్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్ : వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 101 కాన్ఫరెన్స్ చైర్మన్‌గా 2025వ సంవత్సరానికి కమల్ బైడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మురళీనగర్‌లో మంగళవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ –101 ప్రత్యేక సమావేశంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. కమల్ బైడ్ పేరు మురళీనగర్ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం ప్రతిపాదించగా... ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వివిధ వాకర్స్ క్లబ్బుల సభ్యులు బలపరిచారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా డైరెక్టరీ రూపకల్పనకు ముందస్తు అనుమతికి సభ్యులు చేసిన విజ్ఞప్తిని చైర్మన్ కమల్ బైడ్ అనుమతించారు. అనంతరం అనుమతి పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు విజయప్రసాద్, చొల్లంగి ప్రసాద్, ధవల లక్ష్మణరావు, చింతలపాటి శ్రీనివాసరావు, గొర్లె నాగార్జున, శివకుమార్, దర్భా శిరీష, కె.మాధవి, చింతలపాటి వంశీ కృష్ణ వర్మ పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన నిబ్బరగండ్ల రంజిత్‌కుమార్ రెడ్డి (29), కె.ఆంథ్రోస్ (25) కలిసి ఈ నెల 17న అరకు వెళ్లారు. అక్కడ రెండు రోజులు గడిపిన తర్వాత మధ్యవర్తి ద్వారా 22 కిలోల గంజాయి రూ.60 వేలతో కొనుగోలు చేసి విశాఖ రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. ఈ విషయంపై ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్‌కు ముందుగానే సమాచారం అందడంతో సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకుని పరిశీలించారు. అక్కడ రంజిత్‌కుమార్ రెడ్డి, ఆంథ్రోస్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



వృద్ధురాలి మృతదేహం

మర్రిపాలెం : ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కంచరపాలెం ఆర్‌పీ పేట బ్రిడ్జి కిందన పైడితల్లమ్మ ఆలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక వీఆర్‌వో షహనాజ్ పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె వయసు సుమారు 70 ఏళ్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలకు తీర్మానం

డాబాగార్డెన్స్: గ్రాంటు, జీవీఎంసీ సాధారణ పద్దులో ఉన్న పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం తీర్మానించింది. అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం జీవీఎంసీ ప్రాంగణంలో గల అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. లయబిలిటీ పీరియడ్ దాటి పెండింగ్‌లో ఉన్న ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ, ఏఎస్‌డీ కూడా వెంటనే చెల్లింపులు జరపాలని, మరీ ముఖ్యంగా కాంట్రాక్టర్ల అంతర్గత సమస్యలు పరిష్కరించేందుకు కమిషనర్ సమక్షంలో సంబంధిత అధికారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

దోమల నియంత్రణతోనే జ్వరాలకు చెక్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అవగాహన కల్పిస్తున్న తులసి, తదితరులు

సీతమ్మధార : దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారానే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాలను నియంత్రించవచ్చని జిల్లా మలేరియా నివారణ విభాగం అధికారి ఎం.తులసి అన్నారు. వరల్డ్ మస్కిటో డే సందర్భంగా జీవీఎంసీ గాంధీ పార్కులో జిల్లా మలేరియా నివారణ విభాగం, జీవీఎంసీ మలేరియా విభాగం సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులు పైబడి నిల్వ ఉన్న మంచి నీరు, వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వారానికి ఒక రోజు ఫ్రై డే డ్రై డే పాటించి నీటి నిల్వలను శుభ్రం చేయాలని సూచించారు. నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, గోళాలు, సంపులు, ట్యాంకులపై మూతలు పెట్టి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. దోమల నియంత్రణకు అంకితభావంతో పనిచేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌వో శేషుబాబు, మలేరియా ఇన్‌స్పెక్టర్లు బి.శ్రీనివాస్, మంగరాజు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయని జ్యోతికి స్వరకోకిల బిరుదు ప్రదానం



గాయని జ్యోతిని సత్కరిస్తున్న ఉపకార్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు తదితరులు

సీతంపేట: మధుర గాయని గారపాటి జ్యోతికి స్వరకోకిల బిరుదును ప్రదానం చేయడం అభినందనీయమని ఉపకార్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు వి.రామకృష్ణ 77వ జయంతి సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గారపాటి జ్యోతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎన్నో ఆర్కెస్ట్రాల్లో వేలాది పాటలు పాడుతూ అందరి ప్రశంసలు అందుకున్న జ్యోతిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. మాజీ కార్పొరేటర్ బోదిలపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఘంటసాల లేని లోటు తీర్చిన రామకృష్ణ నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్.క్రియేషన్స్ డైరెక్టర్ ఎ.నాగేంద్రకుమార్, ఉపకార్ ట్రస్టు ఇన్‌చార్జి సుధీర్, గంటి మురళి, కొణతాల రాజు, త్యాగరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వైద్య విద్యార్థుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద మొదలైన నిరసన ప్రదర్శన కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ వైద్య విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు న్యాయవాదులు కలెక్టరేట్‌కు చేరుకుని వైద్య విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. అధ్యక్షుడు డాక్టర్ టి.పృధ్వీరాజ్, ఉపాధ్యక్షులు ఆర్.ఊహ, కార్యదర్శి రాజా వివేక్, డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

కొద్ది రోజుల నుంచి సమ్మె చేస్తున్న వైద్య విద్యార్థులు కేజీహెచ్‌లో ఓపీ, వార్డులకు హాజరు కాకపోవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఓపీ, వార్డుల్లో అత్యవసర సేవలు నిలిచిపోకుండా ఏర్పాట్లు చేశారు. రోగులకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామని, ఓపీ కోసం పలువురి సేవలను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు.

డాబాగార్డెన్స్: కోల్‌కతాలో యువ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీకాలనీ: విద్యార్థుల సంక్షేమంతో పాటు హాస్టళ్లలో ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు జిల్లాలోని వివిధ హాస్టళ్ల వార్డెన్లకు సూచించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఏలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల నిర్వహణపై వార్డెన్‌లతో, స్కాలర్‌షిప్స్ చెల్లింపులపై ఫీల్డ్ ఆఫీసర్లతో వేరు వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో బయట ఆహారాన్ని అనుమతించవద్దన్నారు. నాణ్యతమైన ఆహారం విద్యార్థులకు అందించడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచడంతో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం చేయాలని వార్డెన్లను ఆదేశించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల చెల్లింపు కోసం ఎస్సీ, బీసీ, గిరిజన వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. హాస్టళ్ల నిర్వహణ, సౌకర్యాలపై నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు కోసం అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పలువురు అధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

బాక్సింగ్ లీగ్ విజేతలకు సన్మానం



క్రీడాకారులతో రఘురామ్, గొర్లె చందు తదితరులు

కంచరపాలెం : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ బాక్సింగ్ లీగ్ (జీజీకే)లో ప్రతిభ చూపిన విశాఖకు చెందిన ఆంధ్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్‌కు చెందిన కలిశెట్టి శ్రీను, సురేష్‌ను మంగళవారం సత్కరించారు. శ్రీను 1 నిమిషం 40 సెకెన్లలో ప్రత్యర్థిని నాకౌట్ చేశాడు. మరో బాక్సర్ సురేష్ విజయం సాధించాడు. ఇరువురు సెప్టెంబర్ 13, 14న కొచ్చిన్‌లో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ నిర్వహించే ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్ పోటీలకు వెళ్లనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురంలో మంగళవారం ఆంధ్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు విజేతలను ఘనంగా సత్కరించారు. అనంతరం వీరు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అమ్మోరు.నాయుడు, డాక్టర్ సునీల్, రుబెన్, వాసు, గోపాల్, సతీష్, క్రీడాకారులు కె.శ్రీను, సురేష్, జగదీష్, స్వామి, రవి, తరుణ్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

15న 'టెంట్ ఎక్స్‌పో'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో 'టెంట్ ఎక్స్‌పో' నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు సీతమ్మధారలోని ఫంక్షన్ హాలులో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా భారీ స్థాయిలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, అలాగే సభ్యుల సంక్షేమాన్ని కోరుతూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సప్లయర్స్ రంగాన్ని చిన్న తరహా పరిశ్రమగా గుర్తించాలని కోరారు. సంస్థ కార్యదర్శి బి.సాయిబాబా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వివిధ జిల్లాల్లో ఏర్పాటైన సప్లయర్స్ అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు అందరూ కలిసి వెయ్యి మందికి పైగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్.గిరిధర్, ఎస్.చిట్టిబాబు, జి.శ్రీనివాస్, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్సెప్షన్ విభాగంలో పుంజుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణ్‌రావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ పర్సెప్షన్ విభాగంలో వెనుకబడిందని, ఈ పరిస్థితి నుంచి పుంజుకునే దిశగా కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ్‌రావు సూచించారు. ఈ నెలాఖరుకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌కు సంబంధించిన పర్యవేక్షణ బృందం ఏయూను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఐఎస్‌ఓ మేనేజ్‌మెంట్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్టిఫికేషన్‌కు అవసరమైన ప్రక్రియ, తదితర అంశాలపై విభాగాధిపతులు, బీఓఎస్ చైర్మన్లు, విభాగ ఆచార్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. తరగతులు సక్రమంగా నిర్వహించాలని, ఫ్యాకల్టీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఇటీవల విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన ర్యాంకులను సాధించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య జి.గిరిజాశంకర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తరలింపులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డులో ఎన్జీజీవోస్ కాలనీ, 80 అడుగుల రోడ్‌లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించిన అధికారులు ఐదు రోజులు గడుస్తున్నా వాటిని తరలించలేదు. దీంతో ఇళ్ల ముందు చెట్ల కొమ్మలు ఎండిపోయి, ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. చెట్ల కొమ్మలు తరలించాలని జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగానికి ఫిర్యాదులు వస్తున్నాయి. చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే విద్యుత్ విభాగం సిబ్బందే తరలించేవారు. ప్రస్తుతం తరలింపు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లలితానగర్‌లో చోరీ



దుండగులు తొలగించిన కిటికీ గ్రిల్



చిందరవందరగా బీరువాలోని సామగ్రి

సీతమ్మధార : ఫోర్తుటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం, లలితానగర్‌లో విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశ్రాంత ఉద్యోగి ఎస్.హరిహరరావు కుటుంబ సభ్యులతో పది రోజుల క్రితం ఊరు వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి కిటికీ అద్దాలు బద్దలుకొట్టి గ్రిల్ తొలగించి ఉంది. దీంతో తలుపులు తీసి లోపలకు వెళ్లి చూసే సరికి బీరువా తెరిచి దుస్తులు చిందరవందరగా మంచంపై వున్నాయి. బీరువాలో పరిశీలించగా తులం బంగారు నగ, అర కిలో వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్టు క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ ఆదమ్‌తోపాటు క్లూస్ టీం సిబ్బంది ఇంటికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. హరిహరరావు ఫిర్యాదు మేరకు టూటౌన్ క్రైం ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.సునీల్ కేసు నమోదు చేశారు. ఏసీపీ ఆధ్వర్యంలో లలితానగర్‌లోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. గతంలో సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఒక ఇంట్లో ఇదే మాదిరిగా కిటికీ గ్రిల్ తొలిగించి చోరీకి పాల్పడడంతో పోలీసులు పాత నేరస్తులపై నిఘా పెట్టారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ ఐలాండ్‌లు



తహసీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో కానిస్టేబుల్ లేని ట్రాఫిక్ ఐలాండ్

సీతమ్మధార : సీతమ్మధారలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్‌లు అలంకారప్రాయమయ్యాయి. కూడళ్లలో ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణకు గతంలో పలుచోట్ల ట్రాఫిక్ ఐలాండ్‌లు ఏర్పాటు చేశారు. వీటిని పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ కోసం కానిస్టేబుల్‌ను నియమించ లేదు. ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు కానరావడం లేదు. ఒక్కోసారి స్థానికులు సమాచారమిస్తే గానీ ట్రాఫిక్ పోలీసులకు విషయం తెలియడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తహసీల్దార్ కార్యాలయ జంక్షన్, ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్ దరి ట్రాఫిక్ ఐలాండ్‌లు దిష్టిబొమ్మలా తయారయ్యాయి. తహసీల్దార్ కార్యాలయం పక్క రోడ్డులో వాహనాలు వేగంగా వెళ్లడంతో రోజుకో ప్రమాదంతోపాటు నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. గురుద్వార్ దరి పోలీస్ అవుట్ పోస్టు ఉన్నప్పటికీ హైవేపై వచ్చిన వాహనాలు అతి వేగంగా వెళ్లడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టును రోడ్డు విస్తరణ పనుల్లో తొలిగించారు. అక్కడ వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి ట్రాఫిక్ ఐలాండ్‌లలో కానిస్టేబుళ్లు ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.